
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



సోమశిలలో 71.892 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 71.892 టీఎంసీలు ఉన్నాయి. 3,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 1,550, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 800, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,730
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,135
3 శాతం జీఎస్టీతో	రూ.7,349
నవర (8 గ్రా)	రూ.58,792

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుందని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఆదివారం గాలిలో తేమ 77 శాతం ఉంది.

న్యూస్‌రీల్

3, 4 తేదీల్లో ఎస్సీ ఉపవర్గీకరణ కమిషన్ పర్యటన

నెల్లూరు(అర్బన్): షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వన్ మాన్ కమిషన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా జనవరి 3, 4 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ ఏ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న వైఎస్సార్ జిల్లా నుంచి రోడ్డు మార్గాన బయలు దేరి సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరు చేరుకుంటారన్నారు. 4వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశమవుతారన్నారు. అనంతరం వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, కులసంఘాల ప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు. తర్వాత స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి ఇక్కడే బస చేస్తారన్నారు. 5వ తేదీ ఉదయం ఒంగోలుకు బయలుదేరి వెళతారన్నారు.

రాయల్ కాప్స్ సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా శైలజ



శైలజ

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): కాపుల అభ్యున్నతికి దోహదపడుతున్న రాయల్ కాప్స్ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నెల్లూరుకు చెందిన బాసి శెట్టి శైలజ నియమితులయ్యారు. ఈ మేరకు రాయల్ కాప్స్ దేవినాయుడు, ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నరసింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కాపుల అభ్యున్నతికి తన శాయశక్తుల పని చేస్తానని, తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన వారందరికీ శైలజ కృతజ్ఞతలు తెలియజేశారు.

సహకార సంఘ బ్యాంక్ ఖాతాలకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల బ్యాంకు ఖాతాలకు తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలని జిల్లా సహకారశాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప అదేశించారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో అన్ని రికార్డులు, సభ్యుల వివరాలు కంప్యూటరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మొబైల్ అప్లికేషన్ ద్వారా సభ్యులకు సంబంధించిన ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లతో ఈకేవైసీ చేయించాలన్నారు. రుణాలు, సేవలు అన్ని ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేయబడుతాయన్నారు. సహకార సంఘంలోని ప్రతి సభ్యుడు బ్యాంకు అకౌంట్ ప్రారంభించాలని, సభ్యులకు సంబంధించిన రుణాలు, పథకాలు అన్ని ఆయా సహకార సంఘ బ్యాంకు అకౌంట్ ద్వారానే లభిస్తాయన్నారు. జిల్లాలో 67,231 మంది సంఘ సభ్యులు ఉండగా, 39,314 మంది సభ్యులు ఇప్పటి వరకు ఈకేవైసీ నమోదు చేసుకున్నారని, మిగిలిన సభ్యులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): రాష్ట్రంలోని అగ్రి గోల్డ్ బాధితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేసి వారిపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ బాధిత సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు చెప్పారు. నగరంలోని సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా అగ్రి గోల్డ్ ఏజెంట్స్, బాధిత వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 మార్చిలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లోపు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత 10 ఏళ్ల క్రితం అగ్రిగోల్డ్ బాధితులు ఉద్యమాన్ని ప్రారంభించారని, అయినప్పటికీ ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బాధితులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిరావు, అరిగెల నాగేంద్రసాయి, దామా అంకయ్య, రామదాస్, శంకరయ్య, చంద్రశేఖర్ రావు, శివరామకృష్ణ, కృష్ణ, రామకృష్ణ, కోటయ్య, సుబ్రహ్మణ్యం, రవిచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం: దుర్లభం

హాజరువేసి జారుకుంటున్న డాక్టర్లు

- ప్రైవేట్ వైద్యంలో తరిస్తున్న వైనం
- వైద్య సేవలందిస్తున్న ట్రెయినీలు
- రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ఆరు నెలల్లో వైద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రభుత్వ వైద్యం.. పేదోడికి దూరమైంది. రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూ.. సర్కారు వైద్యశాలల్లో విధులకు దుమ్మా కొట్టి.. ప్రైవేట్ సేవలకు ప్రాధాన్యమిస్తున్నారు. థంబ్ వేసి (హాజరు) అర్ధ గంటో.. గంటో పని చేసి ఆ తర్వాత ఆస్పత్రి నుంచి జారుకుంటున్నారు. తిరిగి సాయంత్రం వచ్చి థంబ్ వేస్తున్నారు. ఇదీ.. నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో వైద్యుల పరిస్థితి. అడిగే వారు లేకపోవడంతో వైద్యుల ఇష్టారాజ్యంగా మారింది. వైద్యం కోసం వచ్చిన రోగులకు ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది.



ఓపీ కోసం క్యూలో నిల్చున్న మహిళలు



రోగులు, డాక్టర్లు లేని కేన్సర్ విభాగం

నెల్లూరు (అర్బన్): నిరుపేద, దిగువ మధ్య తరగతి ప్రజలు వైద్య సేవల కోసం వచ్చే నెల్లూరు పెద్దాస్పత్రిలో వైద్యం దుర్లభంగా మారింది. ఇక్కడ పని చేసే వైద్యులు కొందరు నిత్యం విధులకు దుమ్మా కొడుతున్నారు. పేరుకే ప్రభుత్వ వైద్యులు.. సేవలన్నీ ప్రైవేట్ వైద్యశాలల్లో నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. నెలకు రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న వైద్యులు తీసుకుంటున్న జీతానికి కూడా న్యాయం చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రిల్లో ఫుల్ టైమ్ పని చేస్తూ వైద్య వృత్తికే ద్రోహం చేస్తున్నారు. దీంతో భారమంతా చేసే వారిపైనే పడుతోంది. ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసుకుని ఇంటర్న్ షిప్ చేస్తున్న జూనియర్ డాక్టర్లే రోగులకు దిక్కవుతున్నారు. దీంతో నాణ్యమైన వైద్యం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దాస్పత్రిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొంతమంది డాక్టర్లు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

గంట తర్వాత వెళ్లిపోయిన డాక్టర్

పెద్దాస్పత్రిలోని కేన్సర్ ఓపీ విభాగం డాక్టర్ శనివారం ఉదయం 10 గంటలకు వచ్చారు. గంట సేపు మాత్రమే ఉన్నారు. తర్వాత వెళ్లిపోయారు. అక్కడ ఉన్న నర్సును డాక్టర్ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించగా ఫోన్ రావడంతో రోగిని చూడడానికి వార్డుకు వెళ్లారు.. కాసేపట్లో ఓపీకి వస్తారని సమాధానం చెప్పారు. 12 గంటలకు కూడా డాక్టర్ రాకపోవడంతో మరోసారి నర్సును ప్రశ్నించగా డాక్టర్ వార్డులో ఉంటారంటూ చెప్పింది. ఇక ఆ డాక్టర్ మళ్లీ ఓపీ వైపు రాలేదు. కేన్సర్ విభాగంలో ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా హెచ్ఓడీ నెల రోజులుగా సెలవులో ఉన్నారు. మరో డాక్టర్ రాలేదు. వచ్చిన డాక్టర్ కూడా పట్టుమని గంట సేపు కూడా లేరు. ఆ రోజంతా ఒక్క పేషెంట్‌ను కూడా పరీక్షించలేదు.. ముగ్గురు డాక్టర్లు.. ఒక్కొక్కరికి రూ.లక్షల్లో జీతాలు. ఇక్కడి వైద్యుల పరిస్థితిని చూసి ఒక పేషెంట్ కూడా రావడం లేదని వైద్య సిబ్బందే చర్చించుకోవడం కొసమెరుపు

11వ నంబర్ ఓపీలో పరిస్థితి

ఇక్కడ రెండు గదుల్లో డాక్టర్లు రోగులను పరీక్షిస్తున్నారు. మరో గదిలో మాత్రం ముగ్గురు జూనియర్ (ట్రైనీ) డాక్టర్లు రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. అక్కడ ప్రొఫెసర్ కానీ, అసోసియేట్ ప్రొఫెసర్ కానీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కానీ లేరు. జూనియర్ డాక్టర్లు ఏది రాస్తే అదే వైద్యం.

జనరల్ సర్జరీ విభాగం దుస్థితి

ఒక డాక్టర్లు ఉదయం 11.35 గంటల వరకు వైద్య సేవలందించారు. తర్వాత అక్కడ నుంచి వెళ్లిపోయారు. అసోసియేట్ ప్రొఫెసర్ కూడా లేరు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, మరో ఇద్దరు జూనియర్ డాక్టర్లు మాత్రమే వైద్య సేవలందిస్తున్నారు. ప్రతి ఓపీలో జూనియర్ డాక్టర్లపై భారం పెరుగుతోంది. మధ్యాహ్నం 1.30 గంటలకు ఏకంగా తాళం వేసుకుని వెళ్లారు. మళ్లీ 3 గంటలకు తలుపులు తీశారు. సీనియర్ డాక్టర్లకు బదులు జూనియర్లు మాత్రమే ఒకరిద్దరు ఉండి పరీక్షలు చేయించుకుని వచ్చిన రోగులకు మందులు రాశారు. 4 గంటల వరకు ఉండాల్సిన సీనియర్ డాక్టర్లు పత్తాలేరు.

ఏ రోగానికైనా.. ఆ నాలుగు రకాల మందులే..

రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు ఉండి సరైన మందులు రాసి ఇవ్వాల్సి ఉంది. కానీ వీరు ఓపీల్లో లేకపోవడంతో జూనియర్ డాక్టర్లే వైద్య సేవలు అందిస్తున్నారు. ఏ రోగానికైనా ఆ నాలుగు రకాల మందులే ఇస్తుండడంతో పేషెంట్లే విస్తుపోతున్నారు. రోగులకు డైక్లోఫినాక్, పారాసిటమాల్, బీ కాంప్లెక్స్‌తో పాటు స్టిరాయిడ్ వంటి నాలుగైదు రకాల మందులు రాస్తున్నారు. స్టెరాయిడ్ మందులు తప్పనిసరి పరిస్థితుల్లోనే లిమిట్‌గా వాడాల్సి ఉంది. అయినా వీటిని రోగులకు ఇష్టానుసారంగా రాసిస్తున్నారు. స్టెరాయిడ్ మందులు వాడడం వల్ల అదనపు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని డాక్టర్లు పేర్కొంటున్నారు.

ప్రొబేషన్ డిక్లేర్ కాకముందే..

సీనియర్ డాక్టర్లు మాత్రమే కాకుండా ఇటీవల కాలంలో వైద్యశాఖలో ఉద్యోగులుగా చేరిన కొంత మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా పెద్దాస్పత్రిలో సేవలకు దుమ్మా కొట్టి ప్రైవేట్ ఆస్పత్రిల్లో విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో సక్రమంగా ఉంటే రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత అధికారులు రెగ్యులర్ కోసం ప్రొబేషన్ పీరియడ్ డిక్లేర్ చేస్తారు. అలాంటి వారు కూడా ముగ్గురు, నలుగురు ఇలా దుమ్మా కొడుతున్నారంటే వారి ధైర్యాన్ని ఏమనాలో అర్థం కావడం లేదంటూ సాటి డాక్టర్లు పేర్కొంటున్నారు.

కొన్ని ఉదాహరణలు చూస్తే..

- న్యూరో సర్జరీ విభాగంలో ఇద్దరు స్పెషలిస్టులు ఉండాల్సి ఉంటే వారు ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియదు. పరికరాలు లేవనే పేరుతో అటు ఆపరేషన్లు చేయరు. ఇటు రోగులను చూడరు.
- కేన్సర్ విభాగంలోని ఇద్దరు డాక్టర్లుది అదే దారి
- ఆర్థో విభాగంలో ఓ అసోసియేట్ ప్రొఫెసర్ గంట సేపు కూడా విధుల్లో ఉండడం లేదు
- జనరల్ ఫిజిషియన్ విభాగంలో కూడా అదే పరిస్థితి
- ఇద్దరు పురుష ఫిజియోథెరపిస్టులు అందుబాటులో ఉండడం లేదు.
- సైకాలజీ విభాగంలో 12 గంటలకు ఒక్కరూ కూడా ఉండరు.

పనిచేయనీయడం లేదు

ఈఎన్‌టీ విభాగంలో ఒక డాక్టర్ సొంత నిధులతో సైతం మెషీన్ కొని ఆపరేషన్లు చేసేవారు. మరో డాక్టర్ విధులకు సక్రమంగా వచ్చే వారు కాదు. దీంతో వారిద్దరి మధ్య వచ్చిన ఓ చిన్న గొడవను ఆసరాగా చేసుకుని ఆయన్ను అక్కడ నుంచి తప్పించారు. క్యాజువాల్టీలో విధులు అప్పగించారు. ఈఎన్‌టీ డాక్టర్‌కు క్యాజువాలిటీతో ఏమి పని. పని చేసే వారిని చేయనీయకపోవడంతో ఆయన ఇటీవల సెలవుపై వెళ్లారు. ఇలాంటి పరిస్థితులు అన్ని విభాగాల్లో చోటు చేసుకుంటున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో రోగుల సేవలు సక్రమంగా అందడం లేదు. కొంతమంది డాక్టర్లు అధికారులకు లంచాలు ఇచ్చి బయట ప్రాక్టీసులో మునిగి తేలుతున్నారనే విమర్శలు సైతం జోరందుకున్నాయి.

అన్నీ ఉన్నా.. ఏమి లాభం

నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో 750 పడకలున్నాయి. నాణ్యమైన భవనాలున్నాయి. జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జరీ, న్యూరోఫిజిషియన్, న్యూరో సర్జరీ, ఆర్థో, పల్మనాలజీ, చర్మ, నేత్ర, ఈఎన్‌టీ, దంత, ఏఆర్‌టీ క్లినిక్, చిన్నపిల్లల విభాగం, గైనకాలజీ, మానసిక విభాగం ఇలా పలు విభాగాలున్నాయి. ఈ డిపార్ట్‌మెంట్లన్నింటికి ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు జూనియర్ డాక్టర్లు వైద్య సేవలందిస్తున్నారు. ప్రతి రోజు 1000 నుంచి 1300కి పైగా ఓపీ రోగులు వస్తున్నారు. 500 మందికి పైగా రోగులు ఇన్ పేషెంట్లుగా ఉన్నారు. అల్ట్రా సౌండ్ స్కాన్, ఎకో, ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సీటీ వంటి పరీక్షలతో పాటు దాదాపుగా అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. అయినా ఏమి లాభం. అన్నీ ఉన్నా.. అల్లుడు నోట్లో శని ఉన్న చందానా పలువురు డాక్టర్లు అందుబాటులో ఉండకపోవడతో రోగుల బాధలు వర్ణనాతీతం.

ప్రైవేట్ సేవలో డాక్టర్లు

పెద్దాస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్లు విధిగా ఉండాలి. అయితే పలువురు డాక్టర్లు వచ్చి థంబ్ వేసి ఓ అర్ధగంట.. గంట ఉండి.. కొంచెం సేపు చూసిన రోగులకు పరీక్షలు రాస్తారు. తర్వాత జారుకుంటారు. రోగులు పరీక్షలు చేయించుకుని వచ్చేలోపు చూసిన డాక్టర్లుండరు. ఇక జూనియర్ డాక్టర్లు వైద్యసేవలందించాలి. వీరంతా నగరంలోని మెడికవర్, నారాయణ, అపోలో, కిమ్స్ వంటి కార్పొరేట్, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు సొంత క్లినిక్‌లు నిర్వహిస్తూ డబ్బు సంపాదనలో తలమునకలవుతున్నారు.



శనివారం మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు 11వ నంబర్ ఓపీకి తాళం వేసిన ఆస్పత్రి సిబ్బంది, రక్తపరీక్షలు చేయించుకుని వచ్చి డాక్టర్ల కోసం నిరీక్షిస్తున్న రోగులు

పరిస్థితిని చక్కదిద్దుతున్నాం



డాక్టర్లు సక్రమంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇద్దరు, ముగ్గురు ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు తాము నిరంతర తనిఖీలు చేపట్టి డాక్టర్లు విధుల్లో ఉండేలా చూస్తాం. జనవరి 1 నుంచి ప్రత్యేకంగా అలాంటి వారిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటాం. రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూస్తాం.

– డాక్టర్ సిద్ధానాయక్, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్

తవ్వకాల తకరారు!

కూటమి నేతల మధ్య క్వార్ట్జ చిచ్చు.. కార్చిచ్చులా రేగుతోంది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని సైదాపురం, గూడూరు పరిధిలోని మైకా క్వార్ట్జ గనుల కోసం కొట్టుకునే పరిస్థితి తలెత్తినట్లు సమాచారం. గనులు లీజు ఉన్నా.. తవ్విన ఖనిజాన్ని తనకే విక్రయించాలంటూ నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బడా పారిశ్రామికవేత్త, ప్రజాప్రతినిధి హుకుం జారీ చేయడాన్ని మిగతా ఎమ్మెల్యేలు జీర్ణించుకోలేకపోతున్నారు. మరో వైపు లీజు దారులంతా ఏకమై ఎవరైతే ఎక్కువ ధర కోట్ చేస్తారో వారికే విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు లీజు దారులంతా శనివారం చిల్లకూరులో రహస్యంగా సమావేశమై చర్చించుకున్న విషయం తెలిసిందే.

కూటమిలో మైనింగ్ చిచ్చు

- టీడీపీ ఎంపీకి మైకా గనుల అప్పగింత
- చక్రం తిప్పిన ఇద్దరు 'ముఖ్య' నేతలు
- తమకే కేటాయించాలని తిరుపతి జిల్లా తమ్ముళ్ల పట్టు
- వాటాల కోసం పట్టుబడుతున్న జనసేన నేతలు
- పంపకాల్లో కుదరని సయోధ్య




సాక్షి టాస్క్‌ఫోర్స్: నెల్లూరు జిల్లా సైదాపురంలోని అపారమైన ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు కూటమి నేతలు పోటీ పడుతూ.. ఏకంగా కొట్లాటలతో బజారున పడుతున్నారు. సైదాపురంలో ఏడు భూగర్భ గనులు, 140 మైకా క్వార్ట్జ గనులున్నాయి. మరో వందేళ్ల వరకు ఇక్కడ ఖనిజ నిక్షేపాలకు కొదవ ఉండదని నిపుణులు చెబుతున్నారు. వీటి ఆధారిత పరిశ్రమలు వందకుపైగా నడుస్తున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌లో వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలంలో లభించే ఖనిజాన్ని చైనా, జపాన్, రష్యా దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. గతంలో మైకా క్వార్ట్జకు అంతంత మాత్రమే ధర ఉండేది. 8 నెలలుగా మైకా క్వార్ట్జ కి విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. చైనాలోని సెమీ కండక్టర్ పరిశ్రమల్లో మైకా వినియోగిస్తున్నారు. దీంతో మంచి అవకాశం వచ్చిందని గనుల వ్యాపారులు సంబరపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. అధికారం చేపట్టిన వెంటనే తవ్వకాలు, ఎగుమతులను నిలిపివేసింది. 'ముఖ్య' నేత అనుచరుడికి చెందిన ఓ గని, బాలకృష్ణ బంధువుకు చెందిన మరొక గనిలో మాత్రమే తవ్వకాలు, ఎగుమతులకు అవకాశం కల్పించింది. ఆరు నెలల తర్వాత, తొమ్మిది గనులకు అనుమతులు మంజూరు చేసింది. తాజాగా మరో 11 గనులకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మైకా క్వార్ట్జ కోసం విదేశీయులు వచ్చి వెళ్తున్న విషయం తెలుసుకున్న నెల్లూరుకు చెందిన టీడీపీ నేత రూప్‌కుమార్ యాదవ్, మరి కొందరు ఇటీవలే చైనా పర్యటన చేపట్టారు. కొద్ది రోజులు అక్కడే తిష్టవేసి విదేశీయులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది.

దాడులు, దౌర్జన్యాలు

తెల్లరాయికి చైనాలో మంచి డిమాండ్ ఉండడంతో మైకా గనులపై కూటమి నేతల కన్నేశారు. వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నేతలతోపాటు, నెల్లూరు జిల్లాకు చెందిన కూటమి నేతలు కూడా గనుల కేటాయింపులు తమకే కావాలని పట్టుబడుతున్నారు. మైకా గనులు, సిలికాను దక్కించుకునేందుకు ఎవరికి వారు పోటీ పడుతున్నారు. ఖనిజానికి స్థానికంగానే రూ.25 వేల నుంచి రూ.2 లక్షలకు ధర పలుకుతుండడంతో ఈ గనులను తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు వ్యాపారులను రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రూ.కోట్ల విలువైన ఖనిజ సంపదను దోచుకునేందుకు పథకం వేశారు. తమ చేతికి మట్టి అంటకుండా ఉండేందుకు ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పే నెల్లూరుకు చెందిన బడా పారిశ్రామికవేత్త అయిన ఓ ప్రజాప్రతినిధికి బాధ్యతలు అప్పగించారు. ఆయన్ను నెల్లూరు జిల్లాకు చెందిన ఓ యువ నాయకుడిని రంగంలోకి దింపినట్లు సమాచారం. ప్రతి నెలా రూ.30 కోట్లు కప్పం చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే గనులన్నింటినీ సొంతం చేసుకునేందుకు టీడీపీ నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారు. అధికారుల ద్వారా లైసెన్స్ దారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నారు. బెదిరింపులకు లొంగని వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారు. అందులో భాగంగానే ఇటీవల సైదాపురంలోని ఓ మైకా గనిలోని నెల్లూరు జిల్లాకు చెందిన పచ్చమూక చొరబడి విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. టీడీపీ నేతలకు అధికారులు వంత పాడుతున్నారని, గనులు సరెండర్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఓ వ్యాపారి కన్నీరుమున్నీరు కావడం గమనార్హం. మైనింగ్ పోర్టల్ సర్వర్‌లోని ఐడీలను కూడా బ్లాక్ చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గనులశాఖ మంత్రిని కలిస్తే, నెల్లూరు జిల్లా యువ నాయకుడిని కలవమని ఉచిత సలహా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో చేసేది లేక కూటమి నేతలకు కొందరు గనుల యజమానులు లొంగిపోయినట్లు సమాచారం.

నేతల మధ్య యుద్ధం

గనులన్నింటినీ బడా పారిశ్రామికవేత్త, ప్రజాప్రతినిధికి అప్పగించడంపై తిరుపతి, నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు రగిలిపోతున్నారు. దీనిపై ఎమ్మెల్యేలు, జనసేన నేతలు కొందరు నేరుగా 'ముఖ్య' నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే వారి నుంచి నామమాత్రపు స్పందన రావడంతో సీఎంఓ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. సీఎంఓ అధికారులు మాత్రం 'గనులన్నింటినీ ఆ ఎంపీకి అప్పగించేశాం.. ఏమైనా పంచాయితీలుంటే ఆయన వద్దనే తెల్చుకోండి' అని చెప్పినట్లు తెలిసింది.



యంత్రాలతో మైనింగ్ చేస్తున్న దృశ్యం

కానిస్టేబుల్ సాహసం.. దక్కిన ప్రాణం



సురేష్‌ను ఒడ్డుకు తీసుకొస్తున్న కానిస్టేబుల్ గోవిందరాజులు

కావలి: సంధ్య వేళ.. తుమ్మలపెంటసముద్ర తీరం సందర్శకులతో కోలాహలంగా ఉంది. ఆదివారం కావడంతో స్థానికులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వాళ్లు కూడా కుటుంబాలతో వచ్చి సముద్ర తీరంలో సేద తీరుతున్నారు. సందర్శకుల భద్రతను పర్యవేక్షిస్తూ ఇస్కపల్లి కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పహారా కాస్తున్నారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సందర్శకులు కోలాహలంగా ఉన్నారు. సాయంత్రం 4.45 గంటల సమయంలో అలల ఉధృతిలో ఎక్కడో దూరంగా మనిషి కొట్టుకుపోతున్న విషయాన్ని కోస్టల్ సెక్యూరిటీ స్టేషన్ కానిస్టేబుల్ కే గోవిందరాజులు గమనించారు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రాణాలకు తెగించి ఈదుకుంటూ వెళ్లాడు. నిమిషాల వ్యవధిలోనే మునిగిపోతున్న వ్యక్తిని చేరుకుని ఒడ్డుకు తీసుకొచ్చాడు. వివరాలు ఆరా తీయగా సర్వాయపాళెనికి చెందిన వాదినాల సురేష్ రొయ్యల గుంతల్లో పనిచేసే తన స్నేహితులతో తుమ్మలపెంటకు వచ్చాడని తెలిసింది. మద్యం మత్తులో సముద్రంలో మునిగేందుకు వెళ్లగా అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. మద్యం మత్తులో ఉండడంతో కాపాడాలని కేకలు వేసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కానిస్టేబుల్ గోవిందరాజులు స్పందించడంతో అతని ప్రాణాలు దక్కాయని బీచ్‌లో ఉన్న వాళ్లంతా అభినందించారు.

కండలేరులో 57.228 టీఎంసీలు

రాపూరు: జలాశయంలో ఆదివారం 57.228 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 210, సోమశిల నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 520, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

క్లుప్తంగా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



కోవూరు: సాయివినీత్ మృతదేహం

సంగం: మండల కేంద్రమైన సంగంలో ఆదివారం మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొనడంతో పడమటిపాళెం పంచాయతీ ర్యాంపునకు చెందిన డి.నాగలక్ష్మి (54) అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. నాగలక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో బంధువుతో బైక్‌పై సంగం వచ్చింది. వైద్యం చేయించుకున్న అనంతరం తిరిగి వెళ్తుండగా స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఆటో బైక్‌ను ఢీకొట్టడంతో వెనుక కూర్చొని ఉన్న నాగలక్ష్మి కింద పడి తలకు తీవ్రగాయమై చనిపోయింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం మార్చురీకి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని..

కోవూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని పడుగుపాడు చేపపిల్లల పెంపక కేంద్రం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు జంగంవీధికి చెందిన సాయివినీత్ (26) నెల్లూరు నుంచి కోవూరుకు మోటార్‌బైక్‌పై వస్తున్నాడు. అతి వేగం కారణంగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయివినీత్ నెల్లూరులోని ఓ ఆర్కెస్ట్రాలో పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం



ప్రశాంత్ కుమార్ మృతదేహం

ఆత్మకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో జరిగింది. ఎస్సై షేక్ జిలానీ ఆదివారం వివరాలు వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని మంగళపూడికి చెందిన ప్రశాంత్ కుమార్ (29) అనే అతను ఏడాది కాలంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం బీసీ ముస్లిం కాలనీలో ఉంటున్నాడు. విభేదాలతో మొదటి భార్య నుంచి దూరమయ్యారు. అనంతరం వెంగమ్మ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. ఆటో నడుపుతూ జీవిస్తున్న ప్రశాంత్ కుమార్ శనివారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్నాడు. చాలాసేపటి నుంచి ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని వెంగమ్మ గమనించింది. ఇంతసేపు ఎవరితో మాట్లాడుతున్నావంటూ ఆమె భర్తను అడిగి బయటకు వెళ్లిపోయింది. ఈ సమయంలో వారి మధ్య స్వల్ప వివాదం జరిగింది. మనస్తాపానికి గురైన ప్రశాంత్ ఇంట్లోకి వెళ్లి చున్నీతో ఉరేసుకున్నాడు. సమీపంలోని వారు గమనించి అతడిని కిందకు దించి ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ విషయమై మృతుడు తండ్రి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఓ ఉడుతా.. నీకు ఫిదా..

ఉడుతలు చెట్లపై వేగంగా అటూ ఇటూ తిరుగుతూ సందడి చేస్తుంటాయి. ఎవరైనా చూడగానే పరిగెత్తుతాయి. వీటి చేష్టలకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. చిన్నపిల్లలైతే ఉడుతల్ని చూసి కేరింతలు కొడతారు. నెల్లూరు క్లబ్‌లో చెట్టుపై గూడు కట్టుకునేందుకు ఆదివారం రెండు ఉడుతలు ఎండిన ఆకులు, పుల్లలు ఏరుకుంటుండగా 'సాక్షి' కెమెరా బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నా ఫొటో బాగా రావాలబ్బాయ్..



చెవిలో ఏదో చెబుతున్నట్టుగా..



గూడు కట్టుకునేందుకు ఆకుల్ని ఏరుకుని..



ఆకుల్ని చెట్టుపైకి తీసుకెళ్తూ..



ఈ కవర్ పనికొస్తుందేమో.. తీసుకెళ్లిపోదాం..

అంతా తారుమారు



నాడు

నాడు - నేడు కింద అభివృద్ధి చేసిన దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలు చదివే బడులపై ప్రత్యేక దృష్టి సారించారు. నాడు – నేడు పథకం కింద స్కూళ్లలో వసతులు కల్పించారు. అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థిక భరోసా కల్పించారు. క్రమం తప్పకుండా విద్యాకానుక అందించారు. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు కృషి చేశారు.



నేడు

రామయ్య బడిలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

కూటమి ప్రభుత్వం విద్యాశాఖను పూర్తిగా గాలికొదిలేసింది. మనబడి నాడు – నేడు పనుల ఊసే లేదు. నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ట్యాబ్‌లు ఇవ్వలేదు. విద్యాశాఖ గురించి పట్టించుకోకపోవడంతో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో విఫలమైంది. పేద పిల్లల భవిష్యత్ గాలిలో దీపమైంది.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యాశాఖకు పెద్దపీట
- నేడు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- నాలుగు డిప్యూటీ డీఈఓ పోస్టుల్లో మూడు ఖాళీ
- ఎంఈఓ పోస్టుల్లో సగానికి పైనే..
- పాఠశాలలపై పర్యవేక్షణ లేదు
- నిలిచిపోయిన నాడు – నేడు పనులు



నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం

జిల్లాలో..
ప్రభుత్వ పాఠశాలలు : **2,604**
విద్యార్థుల సంఖ్య : **1.82** లక్షల మంది

నెల్లూరు(టౌన్): విద్యాశాఖ గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం పేద పిల్లలు చదివే సర్కారు బడులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా విద్యాశాఖలో సగం పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఉన్నత పోస్టుల్లో అధికారులు లేకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు – నేడు పథకం కింద వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి జిల్లాలో స్కూళ్లను అభివృద్ధి చేసింది. నేడు ఆ పనులు నిలిచిపోయాయి. ఇంగ్లిష్ మీడియం, టోఫెల్, డిజిటల్ విద్య, ట్యాబ్‌లు తదితర వాటిని గాలికొదిలేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలతో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగితే.. నేడు సీఎం చంద్రబాబు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల వైపు తల్లిదండ్రులు మళ్లేలా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి.

బోలెడు ఖాళీలు

జిల్లా విద్యాశాఖలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు ప్రాంతాల్లో డిప్యూటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ పనిచేస్తున్న వారిని నెలరోజుల క్రితం బదిలీ చేశారు. అప్పటి నుంచి అలా వదిలేశారు. కందుకూరులో మాత్రం ఇన్‌చార్జి డిప్యూటీ డీఈఓగా ఒకరికి బాధ్యతలు అప్పజెప్పారు. అదే విధంగా జిల్లాలో 38 ఎంఈఓ పోస్టులు ఉండగా వాటిల్లో 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీతారామపురం, కొండాపురం, జలదంకి, కావలి, బోగోలు, ఏఎస్‌పేట, దగదర్తి, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, బుచ్చి, సంగం, రాపూరు, పొదలకూరు, కోవూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, నెల్లూరు అర్బన్ ప్రాంతాల్లోనే రెగ్యులర్ మండల విద్యాశాఖాధికారులున్నారు. మిగిలిన చోట్ల ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

లేకపోవడంతో..

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈఓ, ఉన్నత పాఠశాలలను డిప్యూటీ డీఈఓలు పర్యవేక్షిస్తుంటారు. పాఠశాలల్లో బోధన, సకాలంలో సిలబస్, ఉపాధ్యాయుల జీతభత్యాలు, పథకాలను విద్యార్థులకు అందించడం తదితర బాధ్యతలను ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు చూస్తారు. పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. కొత్తగా వచ్చిన డీఈఓ సమావేశాలు, సెల్ కాన్ఫరెన్స్‌లకు పరిమితమయ్యారని ప్రచారం ఉంది. దీంతో విద్యాశాఖలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. టీచర్లు పాఠశాలకు రోజూ వస్తున్నారా?, సకాలంలో సిలబస్ పూర్తి చేస్తున్నారా? లేదా? తదితర విషయాలపై పర్యవేక్షణ ఉండటం లేదు. ఓ వైపు మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహిస్తారు. చాలా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉంది. కొన్నిచోట్ల అర్హత ఉన్న ఎస్జీటీలను సర్దుబాటు చేసినా అనుభవలేమితో సక్రమంగా బోధన చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇంకా జిల్లాస్థాయిలో సర్దుబాటు జరగలేదు. ఈ విద్యా సంవత్సరంలో చేస్తారా? లేదా? అనే అనుమానం టీచర్లలో ఉంది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి కాలేదని చెబుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది. ఖాళీలను భర్తీ చేసి, సబ్జెక్ట్ టీచర్లను నియమిస్తే పేద పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఇతర వ్యాపకాల్లో..

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొందరు అధికారులు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పలువురు టీచర్లు పాఠశాలలో ఫేస్ రికగ్నిషన్ వేసి ఎంఈఓ కార్యాలయాల్లో తిష్ట వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మరి కొంతమంది ఇతర వ్యాపకాల్లో ఉన్నట్లు తెలిసింది. ఉదాహరణకు ఇందుకూరుపేట మండలంలోని ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ ఒకరు నెల్లూరులో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. డీఎస్సీ, పోలీస్, బ్యాంక్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వందలాది మందిని చేర్చుకున్నారు. ఆయనకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కంటే కోచింగ్ సెంటర్‌లో వారే ముఖ్యమయ్యారు. స్కూల్‌కు వెళ్లినా ధ్యాసంతా దానిపైనే ఉంటుంది. ఆఖరి బెల్ ఎప్పుడు కొడతారా.. వెళ్లిపోదామా? అని చూస్తుంటారని ప్రచారం ఉంది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల బోధనలో పాఠశాలలకు స్టార్ ర్యాంకింగ్‌లు ప్రకటించింది. కొన్ని జీరో ర్యాంకింగ్‌లో ఉండగా ఎక్కువ బడులు 3, 4లో ఉన్నట్లు తేలింది. అయితే 5వ ర్యాంకింగ్‌లో జిల్లాలో ఒక్క పాఠశాల కూడా లేకపోవడం తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరునెలల్లోనే విద్యాశాఖలో పరిస్థితులు తారుమారయ్యాయి.

త్వరలో భర్తీ చేస్తారు

జిల్లాలో డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఈ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆయా మండలాల్లో పలువురికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పాం. బోధనకు ఇబ్బందులు లేకుండా ఆయా స్కూళ్లకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

కామాక్షితాయి సేవలో డీఆర్వో



ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ్ భాస్కర్‌రావు తన కుటుంబంతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 109
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 220
లేయర్ చికెన్ : 170

నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.32
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపికలకు సర్వం సిద్ధం



శారీరక కొలతల పరీక్షను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు
- సీసీ కెమెరాల ఏర్పాటు
- పరీక్షల రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): పోలీస్ నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో దేహదారుఢ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జనవరి 9వ తేదీ వరకు జరుగుతాయి. ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు మైదానానికి ప్రవేశించింది పరీక్షలు ముగించుకుని తిరిగి వెళ్లే వరకు వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఎత్తు, ఛాతి కొలత, 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పోటీలు జరిగే చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంతోపాటు మంచినీటి సౌకర్యం కల్పించారు.

4,690 మంది

4,690 మంది అభ్యర్థులకు (పురుషులు 3,855 మంది, మహిళలు 835 మంది) పరీక్షలు నిర్వహించనున్నారు. మహిళలకు ప్రత్యేకంగా రెండురోజులపాటు జరుగుతాయని సమాచారం. కాగా దేహదారుఢ్య పరీక్షలు మొదలైనప్పటి నుంచి క్యూఆర్ కోడ్‌తో కూడిన బార్డ్జీని ఏర్పాటు చేస్తారు. తొలుత సర్టిఫికెట్ల పరిశీలన, అనంతరం శారీరక కొలతలు తీసుకుంటారు. పరుగు పోటీల సమయంలో కాళ్లకు సెన్సార్ చిప్స్ అమర్చిన ట్యాగ్‌లు ఉంచుతారు. వాటిని ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా సర్వర్‌కు అనుసంధానం చేశారు. పరుగు మొదలై ముగిసే సమయం వరకు ప్రతి సెకండ్‌ను ఆ చిప్ ద్వారా కంప్యూటర్‌లో నమోదవుతుంది. అనంతరం 1,600 మీటర్ల పరుగుపందెం నిర్వహిస్తారు. పరుగులో ఉత్తీర్ణత సాధించిన వారికి 100 మీటర్లు, లాంగ్‌జంప్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ప్రతి ఈవెంట్ డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో జరుగుతుంది. 256 మందితో బందోబస్తును ఏర్పాటు చేశారు.

పరిశీలించిన ఎస్పీ

ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం పోలీసు కవాతు మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో రిహార్సల్స్‌ను నిర్వహించారు. సర్టిఫికెట్ల పరిశీలన, శారీరక కొలతలు, ఫిజికల్ ఎఫిషియన్సీ, 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్లకు సంబంధించి రిహార్సల్ సరళిని ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం బందోబస్తు విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. కాల్‌లెటర్ ఉన్న అభ్యర్థిని మాత్రమే అనుమతించాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చందన, సీఎంఆర్ ఎక్స్‌ప్రెస్ సేల్ డ్రా విజేత హనీఫా



విజేతకు స్కూటీ నమూనా కీ అందజేస్తున్న అజీజ్

నెల్లూరు(బారకాసు): క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా చందన, సీఎంఆర్‌లు ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ సేల్ క్రిస్మస్ బంపర్ డ్రాలో పడుగుపాడుకు చెందిన హనీఫా విజేతగా నిలిచింది. ఆదివారం నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ అజీజ్ హాజరై డ్రా తీశారు. అనంతరం విజేతకు కారును బహూకరించారు. అలాగే గత వారంలో తీసిన డ్రాలో నాలుగో మైలుకు చెందిన వై.సుజాతకు టీవీఎస్ స్కూటీని అందజేశారు. వీక్లీ డ్రాల విజేతలైన 35 మందికి గ్రైండర్, మిక్సీ, ఎలక్ట్రికల్ కుక్కర్, డిన్నర్ సెట్ తదితరాలను ఇచ్చారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ చందన, సీఎంఆర్ సంస్థలు తక్కువ లాభాపేక్షతో నాణ్యమైన వస్త్రాలు, ఆభరణాలు విక్రయించడమే కాకుండా వారికి వచ్చే ఆదాయంలో వినియోగదారులకు కారు, స్కూటీ, గృహోపకరణాలు అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. అంతేకాకుండా అనేక మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు, చందన అధినేత మావూరి శ్రీనివాసరావు, ఎం.వెంకటగణేష్, మోపూరు పెంచలయ్య, శైలేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

- సహజీవనం చేస్తున్న మహిళ అదృశ్యం
- నెల్లూరులో ఘటన



ఘటనా స్థలంలో మృతదేహం

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన నెల్లూరులో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో పగలంతా భిక్షాటన చేసుకుంటూ రాత్రివేళల్లో రంగనాయకులపేట రైల్వేగేట్ సమీపంలోని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం పక్కనే చెట్ల కింద నిద్రించేవాడు. ఆదివారం ఆయన దారుణ హత్యకు గురై ఉండటాన్ని స్థానికులు గమనించి సంతపేట పోలీసులకు, వీఆర్వో సందానీ బాషాకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఎస్సై బాలకృష్ణలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తి నిద్రలో ఉండగానే దుండగులు కర్రతో తలపై తీవ్రంగా కొట్టారని, దీంతో మెదడు బయటికి వచ్చి చనిపోయినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు సుమారు 45 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు.

ఎవరు చేశారో..

ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి చుట్టుపక్కల విచారించారు. విచారణలో మృతుడు అదే ప్రాంతంలో భిక్షాటన చేసే ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడని, తరచూ వారి మధ్య గొడవలు జరుగుతుండేవని తేలింది. శనివారం రాత్రి వారు కలిసి ఉన్నారని స్థానికులు తెలిపారు. ఆదివారం కనిపించకపోవడంతో ఆమే ఈ ఘాతుకానికి పాల్పడిందా? భయంతో పారిపోయిందా? ఇంకెవరైనా హత్య చేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతుండటంతో విభిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.